APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

బుధవారం 05-11- 2025

సంపుటి : 16 | సంచిక : 333 | ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్ | పేజీలు : 4 | వెల : రూ. 4 epaper.expresstelugudaily.com

## హైదరాబాద్‌లో వైద్యుడి ఇంట్లో రూ.3 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** నగరంలోని ఓ వైద్యుడి ఇంట్లో పోలీసులు డ్రగ్స్ పట్టుకున్నారు. ముషీరాబాద్‌లో అద్దెకు ఉంటున్న జాన్‌పాల్ అనే వైద్యుడి ఇంట్లో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అతడి నివాసంలో తనిఖీలు చేపట్టి.. రూ.3 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. జాన్‌పాల్‌ను అరెస్టు చేసి ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రమోద్, సందీప్, శరత్.. దిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి వైద్యుడు జాన్‌పాల్ ఇంట్లో ఉంచి విక్రయిస్తున్నారు. డ్రగ్స్ విక్రయించినందుకు గాను వైద్యుడికి వీటిని ఉచితంగా ఇస్తున్నారు. అతడి ఇంట్లో ఓజీకుష్, ఎండీఎంఏ, కొకైన్, హాష్‌ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



## రాష్ట్రాలు, యూటీల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలు

**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఫేజ్–2.. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను బిహార్‌లో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్న ఈసీ.. తాజాగా రెండో దశను ప్రారంభించినట్లు తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఈసీ వెల్లడించింది. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు తెలిపింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ నెల పాటు (డిసెంబర్ 4 వరకు) కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఈఎఫ్) ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు 5.3లక్షల మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), 7.64లక్షల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), 10,448 ఈఆర్ఓ/ఏఈఆర్‌వోలు, 321 మంది డీఈవోలు విధుల్లో నిమగ్నమయ్యారని ఈసీ పేర్కొంది. ఈ సమయంలో ఈఎఫ్‌ల పంపిణీ, సేకరణ కోసం బీఎల్‌వోలు ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్తారని తెలిపింది. డిసెంబరు 9న ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేయనుండగా.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో 'ఎస్ఐఆర్' రెండో దశ ముగియనుంది. అస్సాంలోనూ వచ్చే ఏడాది ఎన్నికలు ఉండగా.. అక్కడ 'ఎస్ఐఆర్' కోసం ప్రత్యేక తేదీని ప్రకటిస్తామని ఈసీ ఇప్పటికే ప్రకటించింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన కొనసాగింది. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని ఓ రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని దీదీ ఈ సందర్భంగా ఆరోపించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో 16లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## బాధితులకు రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారు?

### తెలంగాణ హైకోర్టు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ కంపెనీ ఎండీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతులు, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. సిగాచీ పరిశ్రమలో పేలుళ్ల ఘటనపై కలపాల బాబూరావు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున వసుధా నాగరాజు వాదనలు వినిపించారు. పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందారని, ప్రమాదం జరిగి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. బాధితులకు ఇస్తామన్న రూ.కోటి పరిహారం కూడా ఇవ్వలేదని, ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్టు దర్యాప్తులో తేలిందని వివరించారు. నిపుణుల కమిటీ నివేదికను విశ్లేషిస్తున్నామని అదనపు అడ్వొకేట్ జనర్ రజనీకాంత్ తెలిపారు. "192 మంది ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు. సిగాచీ కంపెనీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ సైతం ప్రమాదంలో చనిపోయారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు" అని కోర్టుకు తెలిపారు. బాధితులకు రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించామని, కంపెనీ నుంచి మిగతా డబ్బులు వచ్చేలా చూస్తున్నామని ఏఏజీ వివరణ ఇచ్చారు. రెండు వారాల్లో సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది.



## కారు దిల్లీకి చేరగానే కమలంగా మారుతోంది

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే 4వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నవీన్ యాదవ్‌కు మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్‌లో సీఎం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్పీఆర్ హిల్స్ నుంచి హబీబ్ ఫాతిమానగర్ వరకు రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 30 వేల మెజారిటీతో గెలబోతున్నామన్నారు. "మాగంటి గోపీనాథ్ చనిపోయారు.. ఆయన సతీమణిని గెలిపించాలని భారత రాష్ట్ర సమితి కోరుతోంది. గతంలో పి.జనార్దన్‌రెడ్డి చనిపోతే ఉప ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థిని పెట్టారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోతే వచ్చే ప్రతి ఉప ఎన్నికలో కేసీఆర్ అభ్యర్థిని పెట్టారు. కేటీఆర్‌కు ఇన్ని వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయి. ఇంటి నుంచి గెంటేశారని కవిత రాష్ట్రం మొత్తం తిరుగుతూ గోడు చెప్పకొంటున్నారు. సొంత చెల్లికే న్యాయం చేయలేని కేటీఆర్.. మీకు న్యాయం చేస్తారా? భారత రాష్ట్ర సమితి హయాంలో ఒక్కరికైనా రేషన్ కార్డు ఇచ్చారా? రెండేళ్ల పాలనలో జూబ్లీహిల్స్‌లో 14,159 రేషన్ కార్డులు ఇచ్చాం. భారత రాష్ట్ర సమితి గెలిస్తే మీకు వచ్చే పథకాలు అన్నీ ఆగిపోతాయి. కాళేశ్వరం కేసును సీబీఐకి ఇస్తే 48 గంటల్లో కేసీఆర్, కేటీఆర్‌ను జైలుకు పంపిస్తామన్నారు. సీబీఐకి అప్పగిస్తే 3 నెలలైనా కేసు పెట్టలేదు. ఈనెల 11 లోపు కాళేశ్వరం కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. భాజపా, భారత రాష్ట్రసమితిది ఫెవికాల్ బంధం కాకపోతే సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేయాలి. వీళ్ల అరెస్టులో భాజపా చీకటి ఒప్పందం ఏంటి? ఫార్ములా ఈ–రేస్ కేసులో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి కోరితే స్పందన లేదు. కేంద్ర హోంమంత్రిగా అమిత్ షానే ఉన్నారుగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నారు కానీ, కేసీఆర్, కేటీఆర్‌పై మాత్రం చర్యలు లేవు. కారు దిల్లీకి చేరగానే కమలంగా మారుతోది" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.


## విద్యార్థుల ఫీజులు కట్టలేని సర్కార్.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తుందా?: కేటీఆర్

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టేసిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. విద్యా సంస్థలకు ఇవ్వాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రూ.10 వేల కోట్ల బాకీలు అడిగితే కాలేజీలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, కాలేజీలు మూయిస్తామంటూ బెదిరిస్తున్నారని ఆక్షేపించారు. "విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా లేకుండా పోయింది. విద్యార్థుల ఫీజులు కట్టలేని సర్కార్.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తుందా? లక్షలాది మంది విద్యార్థుల ఫీజులు కట్టలేదు. పీఆర్సీ లేదు. ఉద్యోగుల బాధలను కూడా పట్టించుకోవడం లేదు. పింఛనర్లు రెండేళ్ల నుంచి బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు. రేవంత్‌రెడ్డి నడుతున్నది సర్కారా.. బెదిరింపుల దర్బారా? కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారిని బెదిరించారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే జీతాల్లో 15 శాతం కోత పెడతా అంటున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించని రేవంత్ జీతంలో కూడా కోత పెట్టాలి కదా! ఒక్క ఛాన్స్ ఇవ్వండని మళ్లీ అడుగుతున్నారు. ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకే రాష్ట్రం భ్రష్టుపట్టింది. దొంగ ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలవాలని కాంగ్రెస్ చూస్తోంది. పదేళ్ల కేసీఆర్ పాలన బాగుందా..? రెండేళ్ల రేవంత్ పాలన బాగుందా? మళ్లీ కేసీఆర్ పరిపాలన రావాలంటే జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర మొదలు కావాలి. కరెంటు లేని పరిస్థితి నుంచి సమృద్ధిగా కరెంట్ ఉండేలా చేశాం. పదేళ్లపాటు కంటికి రెప్పలా హైదరాబాద్‌ను కాపాడాం. అభివృద్ధి, సంక్షేమంలో మనతో పోటీపడే సత్తా రేవంత్‌రెడ్డికి లేదు. మహిళలు, రైతులు, నిరుద్యోగులను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. భారత రాష్ట్ర సమితిని గెలిపించండి.. కాంగ్రెస్ గల్లాపట్టి పథకాలు అమలు చేయిస్తాం" అని కేటీఆర్ అన్నారు.



## ఇక ఫోన్‌లోనూ పోస్టల్ సేవలు.. తపాలాశాఖ నుంచి కొత్త యాప్

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పోస్టల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా తపాలా శాఖ కొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. తమ సేవలను మరింత వేగంగా, సౌకర్యవంతంగా అందించేందుకు కొత్త యాప్‌ను తెచ్చింది. పోస్టల్ డిపార్ట్‌మెంట్ అందించే సేవలన్నీ స్మార్ట్‌ఫోన్ ద్వారానే వినియోగించుకునేలా 'డాక్ సేవ' పేరిట యాప్‌ను తాజాగా విడుదల చేసింది. ఈ మొబైల్ యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా సేవలు పొందొచ్చు. ఈ మేరకు 'ఇక పోస్టాఫీస్ మీ జేబులోనే' అంటూ పోస్టల్ డిపార్ట్‌మెంట్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టింది. తపాలా శాఖ అందించే యుటిలిటీలన్నీ ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయని పోస్టల్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. పార్సిల్ ట్రాకింగ్, పోస్టేజ్ కాలిక్యులేషన్, కంప్లయింట్ రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ ప్రీమియం పేమెంట్ వంటి సేవలను పొందొచ్చు. స్పీడ్‌పోస్ట్, మనీ ఆర్డర్ వివరాలను రియల్‌టైమ్‌లో ట్రాక్ చేసుకోవచ్చు. దేశీయ, అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఎంత ఛార్జీ అవుతుందో తక్షణమే లెక్కించొచ్చు. స్పీడ్‌పోస్ట్, రిజిస్టర్డ్ పోస్టు, పార్సిల్ బుకింగ్ సేవలను గంటల తరబడి లైన్లో నిలబడే అవసరం లేకుండా యాప్ ద్వారానే పూర్తిచేయవచ్చు. జీపీఎస్ సాయంతో సమీపం పోస్టాఫీసుల వివరాలు తెలుసుకోవచ్చు. కార్పొరేట్ కస్టమర్ల కోసం ప్రత్యేక విభాగం ఈ యాప్‌లో ఉంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం కూడా చాలా సులభం. గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్‌లో (Dak Sewa App) అని టైప్ చేసి.. అక్కడ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పేరుతో ఉన్న అధికారిక యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్‌ను ఓపెన్ చేసి మొబైల్ నంబర్ లేదా ఈ–మెయిల్ ఐడీతో రిజిస్టర్ అవ్వాలి. ఓటీపీ ద్వారా లాగిన్ అయ్యి సేవలను వినియోగించుకోవచ్చు. మరిన్ని వివరాలు, యూజర్ సపోర్ట్, పాలసీ అప్‌డేట్ల కోసం www.indiapost.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.






# చెల్లని చెక్కులను ఆర్డీవో ఆఫీస్‌కు పంపిన అధికారులు

- చెల్లని చెక్కులు..ఇబ్బందుల్లో లబ్ధిదారులు అనే శీర్షికతో స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించిన మండల రెవెన్యూ అధికారులు
- 07 చెల్లని కళ్యాణ లక్ష్మి,షాదిముబారక్ చెక్కులను ఆర్డీవో ఆఫీస్ కు పంపిన రెవెన్యూ అధికారులు
- రీవ్యాలిడేషన్ కోసం చెక్కులను ఆర్డీవో ఆఫీస్ కు పంపిన రెవెన్యూ అధికారులు
- తమకు న్యాయం జరిగేలా ప్రత్యేకంగా స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో కథనాన్ని ప్రచురించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా ధన్యవాదాలు ఆయా గ్రామాల లబ్ధిదారులు






ఎక్స్‌ప్రెస్ ఎఫెక్ట్

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చెల్లని చెక్కు...ఇబ్బందుల్లో లబ్ధిదారులు అనే శీర్షికతో స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో ప్రచురించిన కథనానికి పెద్దేముల్ మండల రెవెన్యూ అధికారులు స్పందించారు.ఈ మేరకు మంగళవారం కాల పరిమితి దాటిన ఆయా గ్రామాల లబ్ధిదారుల కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారుల నుండి సేకరించి రీవ్యాలిడేషన్ కోసం తాండూర్ ఆర్డీవో ఆఫీస్ కు 07 చెక్కులను మంగళవారం పంపించారు.ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి..ఈ నెల 1వ తేదీ శనివారం నాడు తాండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దేముల్ మండలానికి చెందిన సుమారు 21 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో పలువురు 4,5 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.మిగతా చెక్కులను పెద్దేముల్ మండల రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారు.అయితే రెవెన్యూ అధికారులు అందించిన చెక్కులలో సుమారు 07 చెక్కులకు కాలపరిమితి దాటిపోయింది. అధికారులు ఆ చెక్కులపైన కాల పరిమితి చూడకుండానే, నిర్లక్ష్యంగా,గుడ్డిగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులు తీసుకున్న చెక్కులను బ్యాంకుల్లో తమ ఖాతాల్లో వేయడానికి ఆయా బ్యాంకులకు వెళ్ళారు. బ్యాంకు అధికారులు చెక్కుల పై ఉన్న తేదీలను పరిశీలించి చెక్కుల కాలపరిమితి దాటిపోయిందని,ఈ చెక్కులు చెల్లవని లబ్ధిదారులకు చెప్పడంతో ఒక్కసారిగా అవ్వక్కయ్యారు.అధికారులు తమకు చెల్లని చెక్కులను అందించారని లబ్ధిదారులు నిర్ధారించుకొని ఆవేదనకు గురయ్యారు.అనంతరం చేసేదేమి లేక చెల్లని చెక్కులను తీసుకొని పెద్దేముల్ రెవెన్యూ కార్యాలయానికి వచ్చి అధికారులను అడిగారు.అందుకు అధికారులు సమాధానం చెబుతూ చెక్కులను వెనక్కి తీసుకొని రీవ్యాలిడేషన్ కోసం ఆర్డీవో ఆఫీస్ కు పంపిస్తామని లబ్ధిదారులకు చెప్పారు.అందులో భాగంగా మంగళవారం రెవెన్యూ అధికారులు పెద్దేముల్ మండల పరిధిలోని అడికిచెర్ల గ్రామానికి చెందిన భూచన్ పల్లి మంజుల, అమీనా బీ,మారేపల్లి గ్రామానికి చెందిన బానవత్ తులసి బాయి, మంబాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ సమీనా బేగం, తట్టేపల్లి గ్రామానికి చెందిన రాథోడ్ లక్ష్మీబాయి, శానవాజ్, అనీఫా బేగం లకు సంబంధించిన మొత్తం 07 కళ్యాణ లక్ష్మి,షాదిముబారక్ చెక్కులను తాండూర్ ఆర్డీవో ఆఫీస్ కు రీవ్యాలిడేషన్ కోసం పంపించారు.చెల్లని చెక్కు.ఇబ్బందుల్లో లబ్ధిదారులు అనే శీర్షికతో స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో ప్రచురించిన కథనానికి పెద్దేముల్ మండల రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి తమ చెక్కులను రీవ్యాలిడేషన్ కోసం తాండూర్ ఆర్డీవో ఆఫీస్ కు పంపించి తమకు న్యాయం జరిగేలా కథనాన్ని ప్రచురించిన స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికకు,మండల రెవెన్యూ అధికారులకు ఆయా గ్రామాల కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## మోమిన్ పేట్ మండలంలో రోడ్లు ప్రాణాంతకంగా మారాయి





ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక నిఘా

- ప్రజల ప్రాణాలు రోడ్లలోనే పోతున్నాయంటూ ఆవేదన

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని గ్రామాల రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రతీ మలుపు ప్రమాదానికి దారితీస్తోంది. రోడ్లపై గుంతలు, పగుళ్లు, దెబ్బతిన్న డ్రెయిన్‌లు, కనీస లైట్లు లేకపోవడం వలన ప్రజలు రోజువారీగా ప్రాణాలు పణంగా పెట్టి ప్రయాణిస్తున్నారు.ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ..రోడ్ల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.తరచుగా జరిగే ప్రమాదాల కారణంగా అనేక మంది గాయపడగా, కొంతమంది ప్రాణాలు కోల్పోయారు.గ్రామాల మధ్య ప్రయాణం చేయడం కష్టంగా మారడంతో ఆసుపత్రులు,పాఠశాలలు, వ్యవసాయ మార్కెట్లు వెళ్లడమే ఒక సాహసం అయింది.

### స్థానికులు చెబుతున్నారు

"వర్షాకాలం రాగానే రోడ్లు మట్టి గుంతలుగా మారుతాయి. వాహనదారులు బురదలో పడిపోతున్నారు. పేద ప్రజల కష్టం ఎవరూ చూడడం లేదు,"అని కేసారం గ్రామ రైతు చంద్రయ్యా ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, మోమిన్ పేట్, టేకులపల్లి, గోవిందాపూర్, కేసారం,దేవరంపల్లి, ఎన్కెపల్లి, దుర్గంచెరువు, వంటి గ్రామాల ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా గుంతలే గుంతలు, వాహనదారులు ప్రమాదంలో పడుతున్నారు.ప్రజలు ప్రభుత్వం మరియు రోడ్ల శాఖను తీవ్రంగా విమర్శిస్తూ, వెంటనే రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు."వేల కోట్లు ఖర్చు పెట్టి కొత్త ప్రాజెక్టులు ప్రారంభించే ముందు, ప్రజల ప్రాణాలను కాపాడే రోడ్లను సరిచూడాలి,అని గ్రామ పెద్దలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. "ప్రతి గ్రామంలో రోడ్ల పరిస్థితిని వెంటనే పరిశీలించి,అత్యవసరంగా మరమ్మత్తు పనులు ప్రారంభించాలి. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం."అని ఇదే చివరి హెచ్చరిక అని తెగేసి మోమిన్ పేట్ ప్రజలు అంటున్నారు.



## ప్రభుత్వ కార్యాలయం,పాఠశాల సమీపంలో మద్యం దుకాణం తరలించాలని డిమాండ్

**నర్సింహులపేట,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నర్సింహులపేట మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల సమీపంలో ఉన్న మద్యం దుకాణం వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తోంది.ఈ షాప్ ను తక్షణం అక్కడి నుండి మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలు మాట్లాడుతూ.. ఇక్కడ ప్రతిరోజూ మహిళలు, విద్యార్థులు,వృద్ధులు ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులకు, పాఠశాలలకు వస్తుంటారు.వైన్ షాప్ వల్ల రోజూ మద్యం సేవకుల రాకపోకలు పెరిగి భయాందోళన వాతావరణం ఏర్పడింది" అని తెలిపారు.పాఠశాల సమీపంలో మద్యం సేవిస్తూ పాఠశాలలో కూడా మద్యం సీసలు పడి ఉన్న సందర్భాలు కూడా చాలా ఉన్నాయి.విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాల సమీపంలో ఇలాంటి షాప్ ఉండటం వల్ల పిల్లలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని వారు పేర్కొన్నారు.ఎక్సైజ్ చట్టం ప్రకారం ా పాఠశాలలు,దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, మరియు జనసాంద్రత ఉన్న ప్రదేశాలకు 100 మీటర్ల లోపల మద్యం దుకాణాలు ఉండకూడదని స్పష్టమైన నిబంధన ఉంది. అయినా కూడా ఈ షాప్ అలాంటి ప్రాంతంలోనే కొనసాగుతుండటంపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.వెంటనే చర్యలు తీసుకొని ఆ వైన్ షాప్‌ను తరలించాలని అధికారులు, ఎక్సైజ్ శాఖను కోరుతున్నారు.సమస్య పరిష్కారం కాని పక్షంలో నిరసనకు దిగుతామని డిమాండ్ చేస్తున్నారు.



## చిన్నపాటి వర్షానికి జలమయం

- మున్సిపల్ చైర్మన్

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చిన్నపాటి వర్షానికి జలమయం సమస్య తీవ్రరూపం దాల్చింది.నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి చిన్నపాటి వర్షానికే నందికొట్కూరు పట్టణంలోని మారుతి నగర్,హాజీ నగర్, సాయిబాబా పేట ప్రాంతాలలో జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున మంగళవారం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి,మున్సిపల్ కమీషనర్ యస్ బేబి స్వయంగా వెళ్లి పరిశీలించిఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వరద నీటి సమస్యపై పలుమార్లు నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నల్లావేరు, డ్రెయినేజీ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఆయన విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రజల సమస్యల పట్ల హైవే అధికారుల నిర్లక్ష్య వైఖరి ఖండనీయమని ఆయన పేర్కొన్నారు. కాబట్టి పట్టణ ప్రజల భద్రత దృష్ట్యా తక్షణమే శాశ్వత పరిష్కారం తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కో రారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లాలు ప్రసాద్,డీఈఈ నాసీర్, ఏఈ దినేష్ కుమార్ మున్సిపల్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మొంథా వరద బాధితులకు చేయూత...!



- డాక్టర్ బారికి చంద్రశేఖర్ దంపతులు

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మొంథా వరద బాధితులకు డాక్టర్ బారికి చంద్రశేఖర్ దంపతులు శ్రీకాళహస్తి ఎస్సీ కాలనీ వాసులను ఆకస్మిక వాతావరణ ద్వారా మొంథా వరద తాకిడికి చితికిపోయిన నిరుపేద కుటుంబకులకు దుప్పట్లు పంపిణీ చేసిన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డాక్టర్ బారికి చంద్రశేఖర్ దంపతులు చేయుత చారిటబుల్ ట్రస్ట్. ఆధ్వర్యంలో 2018 స,,అక్టోబర్ కేరళ చెంగనూరు ,సెప్టెంబర్ శ్రీకాకుళం సింగరాయ గూడెం నిరుపేద తిత్లీ వరద బాధితులకు, మరియు 2019 కరోనా లాక్డౌన్ లో ఎమ్మిగనూరు నిరుపేదలకు 2024 విజయవాడ వరద బాధితులకు ప్రస్తుతం మొంథా వరద బాధితులకు శ్రీకాళహస్తి ఎస్సీ,ఎస్టి కాలనీవాసులకు మరియు శ్రీకాళహస్తి పట్టణంలోని ఈశ్వరయ్య యానాది కాలనీలో వరదబాధితులకు 50 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ మాకు తోచిన నిత్యవసర సరుకులు, బట్టలు,దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది .అదేవిధంగా శ్రీకాళహస్తి పట్టణంలోని ఈశ్వరయ్య యానాది కాలనీలో వరద బాధితులకు 50 కుటుంబాలకు దుప్పట్లు పంపిణి. తిరుపతి వే ఫౌండేషన్ పైడి అంకయ్య, దయాగ్నస్టిక్ సెంటర్ డాక్టర్ థామస్ సహాకారం మరువలేనిది.ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి ప్రజా సంఘాల నాయకులు జనామాలు గురవయ్య కేదారి రాధా కృష్ణ,రొడ్డ గోపి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చార్సేలా మునురాజా తదితరులకుడా,, బరికి చంద్రశేఖర్ కుటుంబం కృతజ్ఞతలు తెలియజేశారు.




## తుఫాన్ కు నష్టపోయిన పంట నమోదు చేయాలి





**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని, కొత్తపల్లి ఎంపీడీఓ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య ముఖ్య అతిథిలుగా హాజరయ్యారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మొంతా తుఫాన్ కారణంగా మండలంలో ఉన్న ప్రతి గ్రామాలలో ప్రజలకు ఇబ్బంది పడకుండా రోడ్లు,డ్రైనేజీ,వీధి లైట్ల,త్రాగు నీటి సమస్యలు,వ్యవసాయ శాఖ రైతులు నష్టపోయిన పంటలను నమోదు చేయాల్సిందిగా అధికారులకు సూచించారు. నిలిచి పోయిన పనులను, టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తి చేసి పాలనను కొనసాగిస్తాం అని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి,కొత్తపల్లి మండల జడ్పీటీసీ, ఎంపీపీ, కొత్తపల్లి మండల తహసీల్దార్,ఎండిఓ,మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజల పక్షాన నిలబడ్డ ధర్మా గూగుల్లోత్

## మూడ్ ధర్మ నాయక్" రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ గిరిజన సంఘం

నిరుపేద గిరిజన తండా ప్రజలను చూసివారి అభివృద్ధి ఆమడ దూరంలో ఉన్నది అని గ్రహించి చెలించిపోయి ధర్మ గూగులోత్ వారి పక్షాన నిలబడాలని అనుకున్నాడు. మంగపేట తండా గ్రామం సుజాతనగర్ మండలం ఖమ్మం జిల్లాలో పుట్టిన ధర్మ గూగుల్ చిన్నతనం నుండే తన తాత,తండ్రుల సమక్షంలో చదువు కున్నాడు గారాబంగా పెరిగాడు చుట్టుపక్కల ఉన్న తండాల గ్రామాల నుంచి తాత దగ్గర నాటు వైద్యం కి వచ్చేవారు. ప్రతిదానికి సలహాలు ఇస్తూ వారి అభివృద్ధి కోసం సూచనలు సలహాలు ఇచ్చే కుటుంబం వారిది. స్కూలు లేకున్నా తన ఇంటి దగ్గరే టీచర్ను రప్పించి చదువు చెప్పించాడు తాత మొదటి తరం లంబాడీలో చదువుకున్నాడు. సమాజ అవగాహన తెలుసుకున్న ధర్మ రాజ్యాంగం కల్పించిన హక్కులు గిరిజనులదరి చేరికకపోవడంతో పాలకుల నిర్లక్ష్యాన్ని గుర్తించారు. దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతూ గిరిజనులకు మోసం చేస్తున్నారని భావించాడు.సంక్షేమ ఫలాలు అందకుండా గిరిజనులకు మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నారని గ్రహించిన ధర్మ ప్రజల సమస్యలకు పరిష్కారం మార్క్సిజమే అని నమ్మాడు చివరి కంట నిలబడ్డాడు. మాయదారి రోగం వచ్చి చివరికి తుది శ్వాస విడిచాడు ధర్మ.1971 వరకు ఐటిఐ చదువుకున్నాడు, ఆ సమయంలో విద్యార్థి సంఘంలో పనిచేసీ విద్యార్థుల సమస్యల సాధన కోసం పనిచేశాడు. స్కూలు హాస్టల్లో సమస్యలు పరిష్కారం చేశారు. ఆ తరుణంలోనే సింగరేణి గోదావరిఖనిలో ఎలక్ట్రిషన్ లో ఉద్యోగం వచ్చింది. సమాజ అవగాహన ఉన్న ధర్మ కాలక్రమేణ ఉద్యోగం కంటే ప్రజల మేలు కోసం పరితపించాడు. ప్రజల బాగు పడాలంటే పూర్తి కాలం కార్యకర్తగా పనిచేయాలని భావించాడు అదే తడువుగా పూర్తి కాలం కార్యకర్తగా బాధ్యతలు తీసుకున్నాడు. వచ్చిన ఉద్యోగాన్ని వదిలిపెట్టాడు. యువజన సంఘం లో పనిచేసి కొత్తగూడెం డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాడు. యువజనుల్లో నిరుద్యోగము ఉపాధి, ఉద్యోగం కోసం ప్రభుత్వం చేస్తున్న అలసటను గ్రహించి వాళ్లను ఐక్యం చేసి పోరాటం కొనసాగించాడు. ఆతరణంలోనే సింగరేణి కొత్తగూడెం గిరిజన టింబర్స్



వర్క్స్ అసోసియేషన్ సంఘాన్ని ఏర్పాటు చేశాడు దానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూనే! వ్యవసాయ కార్మిక సంఘం కొత్తగూడెం డివిజన్ కార్యదర్శిగా పని కొనసాగాడు. గ్రామ గ్రామాన మీటింగులు సభలు నిర్వహించాడు. దానితో పాటు ప్రజల సమస్యలు అనేకం

బయటికి రాకపోవడంతో బయటి ప్రపంచానికి తెలవడం లేదని భావించి విలేకరిగా ప్రజాశక్తిలో పని ప్రారంభించాడు. సిపిఎం పార్టీ గుర్తించి పార్టీ కొత్తగూడెం పట్టణ కార్యదర్శిగా ఇల్లందు డివిజన్ కార్యదర్శిగా ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులుగా బాధ్యతలు తీసుకొని ప్రజల్లో పోరాటానికి బాటలు వేశాడు ధర్మ .ప్రజలలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం చేస్తూ ఐక్యంగా సంఘటితం చేసి వారి సమస్యల సాధన కోసం ప్రజల్లో నాలికలాగా మెలిగిన ధర్మ ,1981 పెనగడప సర్పంచిగా పోటీ చేశాడు. 1983 ఇల్లందు ఎమ్మెల్యేగా, 1999 ఖమ్మం జిల్లా ఎంపీగా పోటీ చేసి ఓడిపోయాడు.జూలూరుపాడు జడ్పీసెట్టిసిగా గెలిచి ప్రజలకు సేవలు అందించాడు.గిరిజనుల్లో ఉన్నటువంటి అనైక్యత మూఢనమ్మకం తండాల వెనుకబాటుతనాన్ని గుర్తించి 1994లో బంజారా సంఘం (మైదానం)ఏర్పాటు చేసి గిరిజనుల్లో ఉన్న సమస్యలను తీసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కోసం ప్రయత్నం చేశాడు గ్రామాలకు దూరంగా అడవుల్లో ఉన్నటువంటి గిరిజనులను ఏకం చేసి తమ స్థానిక సమస్యల కోసం పని ప్రారంభించాడు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న గిరిజనులను పోరాటంలోకి తీసుకువచ్చాడు రోడ్లు కరెంటు మంచి నీళ్లు సౌకర్యం లేదు చివరికి స్కూలు కూడా లేని తండాలో ఎన్నో కనబడ్డాయి ఈ తరుణంలోనే ఖమ్మం కేంద్రంగా బంజారా గిరిజనులకి ప్రత్యేక భవనం కావాలని కంకణం కట్టుకొని భూమి భవనం సాధించాడు ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు ఉద్యోగుల్లో విస్తారంగా తీసుకుపోయి తమ ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాడు దానితో ఖమ్మంలో బంజారా భవన్ ఏర్పాటుకు దారితీసింది. 2004 అక్టోబర్ 5,6 గిరిజన సంఘం రాష్ట్ర మూడవ మహాసభ మహబూబాబాద్ లో రాష్ట్రఅధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆరు సంవత్సరాలు కొనసాగారు.తండాలకు దారులు లేవు వ్యవసాయం పొలం గట్ల మీద నడిచి వెళ్లే పరిస్థితి ఉన్నది. మంచినీళ్లు లేక చెరువులు బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి, తండా వాళ్లకి ఉంది కరెంటు, రోడ్లు లేవు మరుగుదొడ్లు అసలు లేదు గిరిజనులకు మనుషులుగా చూసే పరిస్థితి లేదు. పూర్తిగా అడవి ఆధారిత జీవనం కొనసాగుతున్నది, అటవీ ఫలాలు, పశువులు, మేకల పెంపకం వ్యవసాయం మీద ఆధారపడ్డ గిరిజనం దుర్భర జీవితాన్ని గడుపుతున్న టువంటి పరిస్థితి ఉన్నది. గిరిజనులను మనుషులుగా చూడాలని సంక్షేమ ఫలాలు అందాలని బంజారా పోరుబాట పాదయాత్రను 2006 సంవత్సరం 546 తండాలు ఐదు మున్సిపాలిటీలు 60 రోజులు 1200 కిలోమీటర్ల పాదయాత్ర కొనసాగించాడు.తండాలను పంచాయతీలుగా గుర్తించాలని పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఖమ్మం జిల్లా ప్రాంతంలో ఐటిడిఏ ఏర్పాటు చేయాలని విద్యా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విద్యార్థుల కు నిశ్చార్జులు పెంచాలని హాస్టళ్లను సంఖ్యను పెంచాలని రైతులకు గిట్టుబాటు ధర అందించాలని మద్దతు ధర ఇవ్వాలని అటవీ ఉత్పత్తుల మీద జిసిసి కొనుగోలు చేసే వాటిపైన మద్దతు ధర ఇవ్వాలని అనారోగ్యంతో ఉన్నటువంటి గిరిజన గ్రామాల్లో వైద్య సౌకర్యాలు అందించాలని కనీస సౌకర్యాలు కల్పించే చర్యలు తీసుకోవాలని ధర్మ పోరాటం చేశారు. మిగిలి ఉన్న సమస్యల సాధన కోసం, ప్రభుత్వ వాగ్దానల అమలు కోసం, ముందుకు సాగించి ధర్మ గారి ఆశయాలను కొనసాగిద్దామని ఆశిద్దాం. నవంబర్ 5 వర్ధంతి సభను జయప్రదం చేద్దాం...!



మూడ్ ధర్మ నాయక్" రాష్ట్ర
అధ్యక్షులు తెలంగాణ గిరిజన
సంఘం 9490098695.



## మోమిన్ పేట్ ఎంపీడీవో సృజన సాహిత్యకు పీఆర్‌టీయూ సంఘం స్వాగతం

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్ పేట్ మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) సృజన సాహిత్య ని (పీఆర్‌టీయూ టిఎస్) మోమిన్ పేట్ సంఘం తరపున ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లేశం,గెజిటెడ్ హెడ్మాస్టర్ మల్లారెడ్డి,సంఘ అధ్యక్షులు పి.అరుణ్ కుమార్,ప్రధాన కార్యదర్శి దండు రమేష్, ఉపాధ్యాయులు రాందాస్, సి.ఆర్.పి. శ్రీనివాస్,ఐ.ఇ.ఆర్.పీ. మోహన్ తదితరులు పాల్గొన్నారు.సంఘ నాయకులు ఎంపీడీవో సృజన సాహిత్య కి పూలగుచ్ఛం అందించి,మండల అభివృద్ధి కార్యక్రమాలలో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## మాండ్ర,ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలోకి చేరిక



**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కొత్తపల్లి మండలం నందికుంట గ్రామా వైసీపీ శ్రేణులు నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సమక్షంలో మండల కన్వీనర్, క్లస్టర్లు ల గ్రామ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో దాదాపు 50పైగా కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలోకి చేరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మండల నాయకులు వెంకటరెడ్డి,స్వామి రెడ్డి,బుచ్చిరెడ్డి, శేఖర్, రాధాకృష్ణ రెడ్డి,మారేన్న,మల్లయ్య, శివారెడ్డి,గ్రామ మరియు మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ నిధులతో ఆర్ఓ మినరల్ ప్లాంట్ లు పూర్తి...!

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక నిధులు రూ.30 లక్షలతో పట్టణంలోని 6 ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లు నిర్మాణంలో భాగంగా గవర్నమెంట్ హాస్పిటల్ నందు,పగిద్యాల రోడ్డు బైరెడ్డి నగర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్,సంత గేట్ స్కూల్లో,సి.యస్.ఐ పాలెం స్కూల్ లలో 5 పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్ పి.చాంద్ భాషలు మంగళవారంపరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ..ఎంపీ బైరెడ్డి శబరి పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడమేప్రధాన లక్ష్యంతో సమారు రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ నాసిర్, ఏఈ దినేష్,మనోజ్ రెడ్డి,లు తదితరులు పాల్గొన్నారు.



## కార్తీక పౌర్ణమి,కోటి దీపోత్సవాల ఏర్పాట్ల సమీక్ష

- శ్రీశైల దేవస్థానం కార్య నిర్వహణ అధికారి యం.శ్రీనివాస రావు

**శ్రీశైలం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కార్తీకపౌర్ణమి మరియు నవంబరు 14నాటి కోటిదీపోత్సవ ఏర్పాట్లపై కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు, మంగళవారం అన్ని శాఖల అధిపతులు, అన్ని విభాగాల పర్యవేక్షకులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ..కార్తీక పౌర్ణమి నాడు (05.11.2025) భక్తులరద్దీక కనుగుణంగా ఇప్పటికే నిర్ణయించిన ప్రణాళికలను అనుసరించి దర్శన క్యూలైన్లను నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్లలో తొక్కిసలాట, తోపులాటలు లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమాచార వినిమయ లోపం లేకుండా సమిష్టిగా పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు .అదేవిధంగా వాహనాల క్రమబద్దీకరణకు కూడా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యభద్రతా అధికారిని అదేశించారు. ఈ విషయమై స్థానిక పోలీసుశాఖ వారి పూర్తి సహాయ సహకారాలు పొందాలన్నారు.అదేవిధంగా కార్తీకపౌర్ణమిరోజు భక్తులు పుణ్యస్నానాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు.



పాతాళగంగ ఘాట్ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు.ప్రసాదాల విక్రయకేంద్రం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రసాదాలు అందజేత ఉండాలన్నారు. అన్నప్రసాదాలవితరణను త్వరగా ప్రారంభించాలని అన్నప్రసాదవితరణ విభాగాన్ని ఆదేశించారు.ముఖ్యంగా కార్తీకపౌర్ణమినాటి జ్వాలా తోరణోత్స వంలో భద్రతాపరంగా అవసరమైన ముందస్తు జాగ్రత్తలన్నీ తీసుకోవాలన్నారు. జ్వాలాతోరణోత్సవం సమయంలో రెండెంచల బ్యారికేడింగ్ వ్యవస్థ ఉండాలన్నారు. జ్వాలాతోం ֹణోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా ఎల్.ఈ.డీ స్క్రీన్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్తీక పౌర్ణమినాడు జరిగే లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలలో కూడా అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నవంబరు 14న జరుగనున్న కోటిదీపోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు.ఈ ఏర్పాట్లన్నీ కూడా ప్రణాళికబద్దంగా ఉండాలన్నారు. కాగా దీపోత్సవానికి అవసరమైన పూజా సామాగ్రిని దేవస్థానమే సమకూరుస్తుం దన్నారు. కాగా కోటిదీపోత్సవంలో పాల్గొన దలచిన భక్తులు తేది : 12.11.2025 సాయంకాలం గం.5.00ల వరకు దేవస్థాన కార్యాలయంలోని ప్రజాసంబంధాల విభాగంలో వారి పేర్లను నమోదు చేసుకోవచ్చునన్నారు.

## లైసెన్స్ సర్వేయర్లకు ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయాలి

- వికారాబాద్ కలెక్టర్‌కి వినతి

**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా లైసెన్సు సర్వేయర్లు ప్రభుత్వ గుర్తింపుతో పనిచేస్తున్నప్పటికీ, ఇప్పటికీ వేతనాలు మంజూరు చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సర్వేయర్ల బృందం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ని కలిసి, వేతనాలు మంజూరు చేయాలని, శాశ్వత సేవా నియమావళిని అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్బంగా సర్వేయర్లు మాట్లాడుతూ.. "ప్రభుత్వం తరపున పలు పథకాలు, భూ సర్వేలు, ల్యాండ్ రికార్డుల అప్‌డేట్ పనులు మా ద్వారా జరుగుతున్నాయి.అయితే మేము ఎటువంటి వేతనం లేకుండా, కేవలం సర్వేలతో ఆధారంగా పని చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం," అని ఆవేదన వ్యక్తం చేశారు.వేతనాలు లేకపోవడం వలన చాలామంది సర్వేయర్లు వ్యక్తిగతంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే లైసెన్సు సర్వేయర్లకు కనీస వేతనాలు, భద్రతా బీమా, స్థిర సేవా షరతులు కల్పించాలనే డిమాండ్ చేశారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఈ అంశాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ వినతిపత్రం సమర్పణలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్వేయర్లు పాల్గొన్నారు.ప్రజల భూసర్వే పనుల్లో ఎల్లప్పుడూ తమ పాత్రను గర్వంగా నిర్వహిస్తామని, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌ను గుర్తించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సర్వేయర్లు కోరారు.



## టేకులపల్లి గ్రామం ఆదర్శ గ్రామంగా మారేందుకు శాసన సభాపతి చొరవ

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలంలోని టేకులపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా (మోడల్ విలేజ్) గా తీర్చిదిద్దే దిశగా చర్యలు ప్రారంభమ య్యాయి.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా గ్రామంలో ఉన్న కరెంట్ సమస్యలు,విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడటానికి శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో విద్యుత్ శాఖ అధికారులు డీఈ సంజీవి , సత్యనారాయణరెడ్డి ఏఈ వెంకటేష్ ,సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా డీఈ, ఏడీ,లైన్‌మెన్ బృందం గ్రామంలోని విద్యుత్ లైన్లు,ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్ కనెక్షన్లు మొదలైన అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కె.మహేందర్ చారి,గ్రామ సీనియర్ నాయకులు మల్లారెడ్డి,భాస్కర్ (ఎంపీటీసీ)మాజీ సర్పంచ్ పరమయ్య, వెంకటేశం,నరేందర్ గౌడ్,సిరాజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలు ఈ సందర్భంగా శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామాభివృద్ధి కోసం మరిన్ని శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుకున్నారు.

